# 3వ అధ్యాయం

నిర్వచనాలు:

## 3.0 నిర్వచనాలు:

ఈ విధాన పత్రంలో ఉపయోగించిన వివిధ పదాల నిర్వచనాలను దిగువ పేర్కొనడమయింది.

3.1 **"పునరావాస సహాయ పరిపాలకుడు (అడ్మినిస్ట్రేటర్)"** అంటే సంబంధిత ప్రాజెక్టు యొక్క ప్రభావిత కుటుంబాలకు సహాయమందించి పునరావాసాన్ని కల్పించడంకోసం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జాయింట్ కలెక్టరు హెూదాకు తక్కువకాని అధికారి అని అర్థం. అయితే, ప్రాజెక్టు విషయంలో సంబంధిత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం అయినట్లయితే, కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి అట్టి నియామకాన్ని చేయాలి.

3.2 ప్రాజెక్టు విషయంలో **"ప్రభావిత జోను"** అంటే సంబంధిత ప్రభుత్వం ఈ విధానంలోని 5.1 పేరా క్రింద పేర్కొన్న ఈ క్రింది ప్రాంతాల విషయంలో భూసేకరణ చట్టం, 1894 క్రింద లేదా అమలులో ఉన్న ఏదేని ఇతర చట్టం క్రింద భూసేకరణకు ఉద్దేశించిన ప్రాజెక్టు క్రిందకు వస్తుందని ప్రకటించే గ్రామాల ప్రాంతం లేదా ప్రదేశం అని అర్థం.

ఎ) ఎఫ్.ఆర్.ఎల్. కాంటూరు క్రిందకు వచ్చే ప్రాంతం.

బి) ఎఫ్.ఆర్.ఎల్. నీటి లైను నుండి 100 మీటర్ల ఉపరితల దూరంలోకి వచ్చే నివాస గృహాలు.

3.3 **"వ్యవసాయ కుటుంబం"** అంటే వ్యవసాయం ప్రధాన జీవనోపాధిగా ఉన్న కుటుంబం అని అర్థం. దీనిలో, వ్యవసాయ భూమి యజమాని కుటుంబాలతోపాటు కౌలుదార్లు/ఉప-కౌలుదార్ల కుటుంబాలు, వ్యవసాయ కూలీలు, అటవీ భూమి స్వాధీనదార్లు, చిన్నరతహా అటవీ ఉత్పత్తుల సేకరణదార్లు చేరివుంటారు.

3.4 **"వ్యవసాయ కూలీ"** అంటే ప్రభావిత జోనును ప్రకటించిన తేదీకి ముందు మూడు సంవత్సరాల కంటే తక్కువకాని కాలం పాటు ప్రభావిత జోనులో సాధారణంగా నివసిస్తూ భూమి లేకుండా, అట్టి ప్రకటనకు ముందు దానిలోని వ్యవసాయ భూమిలో శారీరక శ్రమతో జీవనోపాధిని పొందుతూ గ్రామసభలో విచారణ ద్వారా నిర్ధారించిన విధంగా జీవనోపాధిని కోల్పోయిన వ్యక్తి అని అర్థం.

3.5 **"వ్యవసాయ భూమి"**లో క్రింది వాటికోసం ఉపయోగించిన లేదా ఉపయోగించడానికి వీలయిన భూములు చేరివుంటాయి.

ఎ. వ్యవసాయం లేదా ఉద్యానవనాలు,

బి. పాడి, కోళ్ళ పెంపకం, చేపల పెంపకం, బ్రీడింగు లేదా పశుగణం, ఔషధ మొక్కలను పెంచుతున్న నర్సరీ,

సి. పంటలు వేయడం, గడ్డి లేదా తోట ఉత్పత్తులు,

డి. వ్యవసాయదారు కలపను కోయడం కోసం ఉపయోగించే భూమి కాకుండా, పశవుల మేత కోసం ఉపయోగించే భూమి.

3.6 **"సంబంధిత ప్రభుత్వం"** అంటే

ఎ) భూసేకరణ, కేంద్రం కోసమైతే, కేంద్ర ప్రభుత్వం.

బి) కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీ/కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ లేక కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు / ఆదేశాలపై ఏదేని ఇతర ఏజెన్సీలు నిర్వహించే ప్రాజెక్టులకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వం లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం.

సి) ఇతర అవసరాలకోసం సేకరించే భూమికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం.

3.7 **"బి.పి.ఎల్. కుటుంబము"** అంటే దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాలుగా భారత ప్రభుత్వం ప్రణాళికా సంఘంచే ఎప్పటికప్పుడు నిర్వచించబడే కుటుంబాలు.

3.8 **"ప్రాజెక్టు"** అనగా,

ఎ. మైదాన ప్రాంతాల్లో 100 లేక అంతకుమించిన కుంటుంబాలను,

బి. గిరిజన ప్రాంతాలు లేక భారత రాజ్యాంగం 5వ షెడ్యూల్లో పేర్కొన్న ప్రాంతాలలో 25 లేక అంతకుమించిన కుటుంబాలను తమ భూములు మరియు / లేక గృహాల నుండి మూకుమ్మడిగా నిర్వాసితులను చేసే మరియు ఈ విధానం క్రింద ప్రకటింపబడిన ప్రాజెక్టు(లు).

3.9 **"పునరావాస సహాయ కమీషనరు"** అంటే రాష్ట్ర ప్రభుత్వం కమీషనరు / కార్యదర్శి హోదాకు తక్కువ కాకుండా నియమించే పునరావాస, సహాయ కమీషనరు.

3.10 ఎ) **"కుటుంబం"** అనగా ఒక వ్యక్తి, భార్య లేదా భర్త, మైనరు కుమారులు, మైనరు కుమార్తెలు, మైనరు సోదరులు లేదా మైనరు సోదరీమణులు మరియు వారితోపాటు నివసిస్తూ తమ జీవనోపాధికి వారిపై ఆధారపడిన ఇతర సభ్యులు. అట్టి వ్యక్తితోపాటు నివసించే ప్రతి మేజరు కుమారుడు మరియు మేజరు కుమార్తె ప్రత్యేక కుటుంబంగా పరిగణింపబడుదురు. అట్టి వారి వయస్సు 18 సంవత్సరములు అని నిర్ధారించు తేది ఏదనగా అట్టి గ్రామము ఈ విధానంలోని పేరా 5.1 క్రింద ప్రకటింపబడి భూసేకరణ చట్టం, 1894లోని సెక్షన్ 4(1) క్రింద సేకరించుటకు నిర్ణయించిన తేది. [1]

3.10 బి) **"నిస్సహాయ వ్యక్తులు"** అనగా ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించబడని లేక వెంటనే కల్పించే వీలులేనివారై ఉండి మరియు ఏ కుటుంబంలోను సభ్యులు కానటువంటి వికలాంగులు, నిరుపేదలు, అనాధలు, విధవరాండ్రు, పెళ్ళికాని మేజరు కూతుళ్ళు, భర్తచే వదలివేయబడిన / విడాకులు పొందిన స్త్రీలు మరియు 50 సంవత్సరాల వయస్సు నిండిన వ్యక్తులు. [2]

3.11 **"కమతం"** అంటే స్వాధీనదారుగా లేదా కౌలుదారుగా లేదా ఈ రెండు విధాలుగా ఒక వ్యక్తి స్వాధీనంలో ఉన్న మొత్తం భూమి అని అర్థం.

3.12 **"సన్నకారు రైతు"** అంటే ఒక హెక్టారు వరకు నీటిపారుదలలేని భూమి లేదా అర హెక్టారు వరకు నీటిపారుదల కలిగిన భూమి లేదా ఇదే ప్రాతిపదికపై రెండింటిని కలిగివున్న వ్యవసాయదారు అని అర్థం.

3.13 **"వ్యవసాయేతర కూలీ"** అంటే, ప్రభావిత జోను ప్రకటించిన తేదీ నాటికి మూడు సంవత్సరాల కాలానికి తక్కువగాకుండ ప్రభావిత జోనులో నివసిస్తూ వ్యవసాయ కూలీ కానటువంటి, ఎలాంటి భూమి లేనటువంటి ముఖ్యంగా శారీరక శ్రమ లేక చేతి వృత్తుల ద్వారా జీవనోపాధిని పొందుతూ అట్టి జీవనోపాధిని కోల్పోయిన వ్యక్తి.

3.14 **"ప్రకటన"** అంటే అధికారిక గెజెట్‌లో ప్రచురించబడిన ప్రకటన అని అర్థం.

3.15 ఎ) **"స్వాధీనదార్లు"** అంటే 13-12-2005వ తేదీకి ముందునుండి అటవీ భూమిని తమ స్వాధీనంలో ఉంచుకున్న షెడ్యూల్డు తెగలు / ఇతర సాంప్రదాయ అటవీ నివాసితులు. [3]

3.15 బి) **"ఇతర సాంప్రదాయ అటవీ నివాసి"** అనగా 13-12-2005వ తేది నాటికి ముందు కనీసం 3 తరాలుగా (తరం అంటే 25 సంవత్సరాల కాలం) నివసిస్తూ, తమ జీవనోపాధి అవసరాల నిమిత్తం అడవి లేక అటవీ భూములపై ఆధారపడిన సమాజం యొక్క సభ్యుడు. [3]

3.16 **"ప్రాజెక్టు ప్రభావిత కుటుంబం"** అంటే

ఎ) ప్రాజెక్టుకోసం భూ సేకరణ ప్రక్రియలో జీవనాధారం గణనీయంగా దెబ్బతిన్న, భూమిని కలిగివున్నారా లేదా అనే విషయంతో నిమిత్తం లేకుండా ప్రభావిత జోనును ప్రకటించడానికి ముందు ప్రభావిత జోనులో మూడు సంవత్సరాల కంటే తక్కువకాని కాలంపాటు నిరంతరంగా నివసిస్తున్న లేదా మూడు సంవత్సరాల కంటే తక్కువకాని కాలంపాటు ఏదేని వర్తకాన్ని, వ్యాపారాన్ని లేదా వృత్తిని నిరంతరంగా చేస్తున్న కుటుంబం.

బి) భూ సేకరణలో 50 శాతం కంటే ఎక్కువ భూమిని కోల్పోయిన, భూ సేకరణ తరువాత మిగిలిన భూమి 5 ఎకరాల మెట్ట లేదా 2.5 ఎకరాల మాగాణి లేదా ఇదే ప్రాతిపదికపై రెండింటికంటే తక్కువగా ఉన్న కుటుంబం అని అర్థం.

---

1. జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 88, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగం, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్-I) శాఖ, తేది. 26-08-2010 ద్వారా సవరణ.
2. జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 77, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగము, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్) శాఖ, తేది. 10-07-2009 ద్వారా సవరణ.
3. జి.ఓ.ఎమ్.ఎస్.నెం. 134, నీటిపారుదలఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగం, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్) శాఖ, తేది. 13-11-2009 ద్వారా సవరణ.

సి) ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబం.

డి) ఏదేని నిర్ధారిత కాలానికి సాగుదారుడు, కౌలుదారుడు, లీజుదారుడు లేక ఇతర ఆస్తులు కలిగిన వాడైవుండి ప్రభావిత జోనులో భూమి (ఆ బాదిలోని ఇంటి స్థలం లేక ఇతర ఆస్తులతోపాటు) సేకరణ లేక ఇతర కారణాల వలన తప్పనిసరిగా నిర్వాసితమైన కుటుంబం.[1]

3.17 **"ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబం"** అంటే ప్రాజెక్టు కోసం ప్రభావిత జోనులోని గ్రామంలో తన నివాసిత గృహాన్ని సేకరించినందున ఆ నివాస గృహం నుండి నిర్వాసులైన కుటుంబం అని అర్థం.

3.18 ప్రాజెక్టుకు సంబంధించి **"పునరావాస జోను"** అంటే సంబంధిత ప్రభుత్వం ఈ విధానంలోని 5.12 పేరా క్రింద ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాల పునరావాసం కోసం, పునరావాస జోనుగా సేకరించడ మయిందని లేదా సేకరించాలని ప్రతిపాదించడమయిందని ప్రకటించే ఏదేని ప్రాంతం అని అర్థం.

3.19 **"అవసరమైన సంస్థ"** అంటే సంబంధిత ప్రభుత్వం భూమిని సేకరించాల్సివున్న ఏదేని కంపెనీ, కార్పొరేట్ సంస్థ, ఇన్‌స్టిట్యూషను లేదా ఏదేని ఇతర వ్యవస్థ అని అర్థం. సంబంధిత ప్రభుత్వం తన స్వంత ఉపయోగానికి లేదా ప్రజాప్రయోజనం దృష్ట్యా కౌలు, లైసెన్సు క్రింద కార్పొరేట్ సంస్థ, ఇన్‌స్టిట్యూషన్ లేదా ఏదేని ఇతర వ్యవస్థ లేదా ఏదేని కంపెనీకి లేదా ఏదేని ఇతర భూమి బదిలీ పద్ధతిద్వారా అట్టి కంపెనీలకు తదుపరి కేటాయించడానికి భూమిని సేకరించినట్లయితే అట్టి సంబంధిత ప్రభుత్వం కూడ ఇందులో చేరి ఉంటుంది.

3.20 **"చిన్నకారు రైతు"** అంటే ఒక హెక్టారుకు మించి, రెండు హెక్టార్ల వరకు నీటిపారుదల లేని భూమిని కలిగివున్న లేదా అర హెక్టారుకు మించి, ఒక హెక్టారువరకు నీటిపారుదల కలిగిన భూమి లేదా ఇదే సూత్రంపై రెండు కలిపి సాగుచేసే భూమిని కలిగివున్న సాగుదారు అని అర్థం.

3.21 **"గణనీయంగా దెబ్బతిన్న"** అంటే పిఎఎఫ్ సగటు వార్షిక ఆదాయం 50 శాతానికి మించి తగ్గుతుందని భావించినప్పుడు లేదా ప్రాజెక్టు కోసం ఆయన భూమి లేదా ఇతరుల భూమి సేకరించడం మూలంగా భూమి లేదా ఇతర వనరుల ఆదాయాల నుండి ప్రకటన తేదీకి ముందు గత మూడు సంవత్సరాలలో ఆయన సగటు వార్షిక ఆదాయాన్ని పోల్చిచూడగా బిపిఎల్ కుటుంబం అవుతుందని భావించినప్పుడు అని అర్థం.

3.22 **"గిరిజన ప్రాంతాలు"** అంటే, ఎప్పటికప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ ప్రకటించే ప్రాంతాలు అని అర్థం.

3.23 **"అంబుడ్స్‌మన్"** అంటే, ఈ విధానంలోని 7.5 పారా క్రింద నియమించబడిన వ్యక్తి.[2]

---

1. జి.ఓ.ఎమ్.ఎస్.నెం.134, నీటిపారుదలఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగం, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్) శాఖ, తేది.13-11-2009 ద్వారా సవరణ.
2. జి.ఓ.ఎమ్.ఎస్.నెం.134, నీటిపారుదల ఆయకట్టు ప్రాంత అభివృద్ధి (ప్రాజెక్టు విభాగం, ఎల్.ఎ. IV ఆర్ అండ్ ఆర్) శాఖ, తేది.13-11-2009 ద్వారా సవరణ.